
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



కార్యకర్తలను కాపాడుకుంటాం

కంటికి రెప్పలా చూసుకుంటాం
పురానికి నారా, నందమూరి కుటుంబాలు అండగా ఉంటాయి : నారా భువనేశ్వరి
మూడోరోజు కొనసాగిన నిజం గెలవాలి యాత్ర
మృతుల కుటుంబాలకు పరామర్శ
ఆర్థికసాయం చెక్కుల పంపిణీ (7లో..)



(7లో..)

మంత్రి, సీఎం రాజీనామా చేయాలి

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్



మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినందున.. సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి బాధ్యత వహించి రాజీనామా చేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ డిమాండ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇసుక దందా నిజమేనని హైకోర్టు ఆదేశాలు స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. ఇసుక పాలసీ, ధరల నిర్ణయం గురించి హైకోర్టు నివేదిక కోరిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వ ఇసుక పాలసీ సీఎం తమ్ముడికి, పక్కరాష్ట్ర ముఖ్యమంత్రి మేనల్లుడికి లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని ఆరోపించారు. పర్యావరణానికి ముప్పు కలిగించేలా పెద్ద పెద్ద యంత్రాలతో ఇసుకను తవ్వారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వమే ఈ అక్రమాలకు పాల్పడిందని, సమస్యలు వచ్చినప్పుడు అధికారులను బలి చేస్తున్నారని అన్నారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ సంబంధిత శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనకు సహకరించిన సీఎం జగన్ కూడా తన పదవికి రాజీనామా చేయాలని, విచారణకు పూర్తి స్థాయిలో సహకరించాలని అన్నారు. మూడు వారాలలో నివేదిక ఇవ్వాలని హైకోర్టు కోరిందని, వారంలోపే వివరణ ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సూచించారు. ఇసుక అక్రమాలపై కేంద్రం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సీబీఐకి అప్పగిస్తారా..? ఈడీకి అప్పగిస్తారా..? తేల్చాలని డిమాండ్ చేశారు.

నీటి సమస్యను పరిష్కరించాలి: శైలజానాథ్

జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం జగన్.. జిల్లాలో నీటి సమస్యను పరిష్కరించాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు శైలజానాథ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రి, ఇతర నాయకులు స్వార్థ రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, జిల్లా రైతాంగానికి మేలు జరిగేలా చూడాలని అన్నారు. జిల్లాలో నెలకొన్న నీటి ఎద్దడి గురించి ముఖ్యమంత్రితో చర్చించాలని సూచించారు. వైసీపీ నాయకులు సిద్ధం సిద్ధం అని పోస్టర్లు చూపుతున్నారని, జిల్లా ప్రజలు వలస వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీడిపల్లి నుంచి దిగువకు నీరు వెళుతోందని, పీఏబీఆర్‌లో నీరే లేదని, తాగునీటికి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. జిల్లా కేంద్రంలోనే అరగంట సరఫరా చేస్తున్నారని, పరిస్థితి ఇలాగే కొనసాగితే వారానికి ఒక్కరోజు కూడా నీరు అందదని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు ముందే మేలుకోవాలని సూచించారు. నీరు లేక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. ఎన్నికల గురించే కాకుండా రైతాంగం గురించి కూడా ఆలోచించాలని సూచించారు. జిల్లా సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కార మార్గాలు చూపాలని అన్నారు.

నేడు మాణిక్యం ఠాకూర్ రాక

కాంగ్రెస్ పార్టీ ఏపీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాకూర్ శుక్రవారం జిల్లా పర్యటనకు వస్తున్నారని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ గురువారం తెలిపారు. రాయలసీమలోని ఎనిమిది జిల్లాలు, మండల, పట్టణ అధ్యక్షులతో ఆయన సమావేశమై.. ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. సమావేశానికి సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, సీనియర్ నాయకులు కొప్పుల రాజు, జేడీ శీలం, గిడుగు రుద్రరాజు, తులసిరెడ్డి, పల్లం రాజు తదితరులు హాజరవుతారని తెలిపారు.

సరుకుల్లో కోత

అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని నూనె, పప్పు
తాడిపత్రి, నార్పల ప్రాజెక్టుల పరిధిలో సమస్య

తాడిపత్రి, ఫిబ్రవరి 15: తాడిపత్రి, నార్పల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 337 అంగన్‌వాడీ సెంటర్లకు 15 రోజులు దాటినా ప్రీస్కూల్ బియ్యం చేరలేదు. కందిబేడలు, నూనె సైతం రాలేదు. వీటికోసం అంగన్‌వాడీ కార్యకర్తలు సెంటర్‌ను వదిలి డీలర్ల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. గోడౌన్ నుంచి బియ్యం, బేడలు, నూనె రాలేదని డీలర్లు చెబుతున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీచేసే బియ్యం, నూనె, కంది పప్పులో సైతం భారీ స్థాయిలో కోత విధించారు. గోడౌన్ నుంచి వచ్చిన ఆర్వో ప్రకారమే వీటిని పంపిణీ చేస్తున్నామని డీలర్లు తెలిపోతున్నారు.

ప్రీ స్కూల్ చిన్నారులకు అందని బియ్యం



జూటూరు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

ఎలా సర్దుకుపోవాలి..?

బియ్యం, కందిపప్పు, నూనె సరఫరా కావడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్ల దృష్టికి తీసుకెళుతున్నారు. ఇతర సెంటర్‌లలో ఉన్న బియ్యం తెచ్చుకుని ఎలాగోలా సర్దుకుపోవాలని వారు ఉచిత సలహా ఇస్తున్నారని కార్యకర్తలు వాపోతున్నారు. తమకు రావాల్సిన సరుకులపై స్పష్టత ఇవ్వడం లేదని అంటున్నారు. ఇతర సెంటర్ల నుంచి బియ్యాన్ని సర్దుబాటుగా తీసుకురావాలన్నా.. రవాణా ఖర్చులను తామే భరించాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికే సమ్మె కాలానికి సంబంధించిన జీతాలు రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల అద్దె, కరెంట్ బిల్లులకు అప్పులు తెచ్చి చెల్లించారు. ఇంటి ఖర్చులకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అదనంగా ఖర్చులను ఎలా పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు.

సచివాలయ సిబ్బంది నిర్వాకమేనా?

డిసెంబరు నెల నుంచి జనవరి 22 వరకు అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మెలో ఉన్నారు. సమ్మె కాలంలో సచివాలయ సిబ్బంది సెంటర్ల తాళాలు పగలగొట్టి అందులోని సరుకుతోపాటు కొత్తగా డీలర్ నుంచి వచ్చిన సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సమయంలో తప్పులతడకగా రికార్డులు రాశారని, పెద్దఎత్తున బఫర్ స్టాక్ మిగులు ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోయిందని సమాచారం. ఈ బఫర్ స్టాక్ మినహాయించి, మిగిలిన సరుకులను పంపడం వల్లే కొరత వస్తోందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అంటున్నారు. బఫర్ స్టాక్‌ను అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ముందుగా ఎందుకు పసిగట్టలేకపోయారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బఫర్ స్టాక్ వల్ల కోత విధించారా, లేదా అన్నదానిపై తాడిపత్రి గోడౌన్ ఇన్‌చార్జి, స్టాకిస్టులను ఆంధ్రజ్యోతి వివరణ కోరేందుకు ప్రయత్నించింది. వారు అందుబాటులోకి రాలేదు.

అందని నూనె

యల్లనూరు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు నెలల తరబడి నూనె సరఫరా కాలేదు. కొన్ని సెంటర్లకు అరకొరగా బియ్యం, బేడలు వస్తున్నాయి. సకాలంలో సరుకులు అందకపోవడం, వచ్చిన సరుకుల్లో కోతలు ఉండడంతో ప్రీస్కూల్ విద్యార్థులకు సరైన భోజనం అందడంలేదు. ఫ్యాక్షన్ ప్రభావిత మండలం కావడంతో అక్కడి డీలర్లకు సరుకులు చేరినా, పంపిణీ చేయడం లేదా..? లేక తాడిపత్రి రైస్ గోడౌన్ నుంచి తగినన్ని సరుకులు రావడం లేదా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏం జరుగుతోంది..?

తాడిపత్రి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 246 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. తాడిపత్రి పట్టణంలో 66, మండలంలో 63, యాడికి 48, పెద్దపప్పూరు 52, పెద్దవడుగూరు 50 సెంటర్లు ఉన్నాయి. నార్పల ప్రాజెక్ట్ పరిధిలోని పుట్లూరు మండలంలో 49, యల్లనూరు మండలంలో 42 సెంటర్లు ఉన్నాయి. ఈ సెంటర్లకు తాడిపత్రి, గుత్తి గోడౌన్ నుంచి సరుకులు డీలర్ల ద్వారా అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా అవ్వాలి. పుట్లూరు మండలంలోని 49 అంగన్‌వాడీ సెంటర్లలో కొన్నింటికి నూనె, సరుకులు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. కొన్ని సెంటర్లకు బియ్యం సరఫరా కాకపోగా, మరికొన్ని సెంటర్లకు నూనె రావడం లేదు. ప్రీస్కూల్ విద్యార్థులకు బియ్యం పంపిణీ జరిగినా, నూనె రావడం లేదని కొందరు డీలర్లు చెబుతున్నారు.



దైవ సేవకులకు ఎర

జగన్‌ను గెలిపించాలని కోరిన విమలమ్మ



తెల్లటి కవర్లలో నగదు పంపిణీ..

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: దైవం గురించి నలుగురికీ ప్రచారం చేసే దైవ సేవకులను వైసీపీ నాయకులు తమ పార్టీ సేవకులుగా మార్చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మేనత్త వైఎస్ విమలారెడ్డి గురువారం జిల్లా కేంద్రంలోని కేటీఆర్ ఫంక్షన్ హాల్‌లో దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితోపాటు క్రైస్తవ సంఘాల నాయకులు హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు వెయ్యి మందికి పైగా పాస్టర్లను సదస్సుకు సమీకరించారు. వైఎస్ విమలారెడ్డి తొలుత బైబిల్ పఠనం చేశారు. అనంతరం తమ సదస్సు ముఖ్య ఉద్దేశమైన ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. క్రైస్తవులకు ఏదైనా సమస్య వస్తే తనను సంప్రదించాలని, అవసరమైతే ముఖ్యమంత్రి జగన్ వద్దకు తానే తీసుకెళతానని అన్నారు. సదస్సుకు హాజరైనవారి పేర్లను నమోదు చేసుకుని, టోకెన్లు జారీ చేశారు. సదస్సు ముగిసి, భోజనాలు పూర్తయిన తర్వాత క్యూలో నిల్చోబెట్టి టోకెన్లు పొందినవారికి తెల్లటి కవర్లలో రూ.వెయ్యి చొప్పున నగదు పంచారు. ఇలా దైవసేవకుల సదస్సును వైసీపీ నేతలు పార్టీ సేవకుల సదస్సుగా మార్చేశారు.

ఆదర్శ పురుషుడు సేవాలాల్

జేసీ కేతన్ గార్గ్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15: హింస పాపమని, మత్తు పదార్థాల వినియోగం శాపమని చాటిన సేవాలాల్ మహరాజ్ ఆదర్శ పురుషుడని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ కొనియాడారు. సేవాలాల్ 285వ జయంతి ఉత్సవాల సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అహింసా సిద్ధాంతానికి పునాది వేసిన మహనీయుడు సేవాలాల్ అని, ఆయన బంజారాలకే కాక అన్ని వర్గాల ప్రజలకూ ఆదర్శప్రాయులని అన్నారు. కార్యక్రమంలో డీఆర్వో రామక్రిష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు నీలమయ్య, రవీంద్ర, ఆనంద్, కలెక్టరేట్ ఏఓ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.





అలంకరణలో మూలవిరాట్

● ఆదిత్యుడి వేడుక

నేడు బూదగవిలో రథోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. స్వామివారి మూలవిరాట్‌ను అభిషేకించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహాగణపతి పూజ, గోపూజ, కలశస్థాపన, దీక్షా హోమాలను నిర్వహించారు. రథసప్తమి రోజున శుక్రవారం ఆదిత్యుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈవో కృష్ణయ్య తెలియజేశారు. ఆలయ ఆవరణలో హోమాలను నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్లను ఏర్పాటు చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని ఛాయా ఉషా సమేత సూర్యనారాయణస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తారు.

హక్కుల కోసం రోడ్డెక్కాలా..?

- ఏపీ జేఏసీ నాయకుల ఆగ్రహం
- జిల్లా వ్యాప్తంగా రెండో రోజు నిరసన



కలెక్టరేట్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 15: 'మా హక్కులు, అలవెన్సుల కోసం రోడ్డెక్కాలా..? మాకేమిటీ ఖర్మ..?' అని ఏపీ జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండో రోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కలెక్టర్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో డీఆర్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్జిత సెలవుల బిల్లులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని అన్నారు. పీఆర్సీ బకాయిలు, డీఏలు, 11వ పీఆర్సీ డీఆర్ అరియర్స్‌ను నిలుపుదల చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పష్టత, లాభం లేని 12వ పీఆర్సీ కమిషన్ వేసి అన్ని వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, పార్ట్ ఫైనల్స్ దరఖాస్తులను నెలల తరబడి పెండింగ్‌లో ఉంచారని అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే అంశంపై నేటికీ స్పష్టత ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపి, కంటితుడుపు చర్యలతో మోసగిస్తున్నారని విమర్శించారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో ఆందోళనలకు దిగామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్, ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, ఏపీటీఎఫ్ ఓబులేసు, ఎన్జీఓ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతుల దహనం



ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15: టీచర్ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని టీఎస్ఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్, జీవో 117 ప్రతులను ఎన్టీఆర్ సర్కిల్‌లో గురువారం దహనం చేశారు. వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ వల్ల నిరుద్యోగులకు ఎలాంటి ఉపయోగం లేదని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు లక్ష్మీనరసింహ అన్నారు. జీవో 117 వల్ల తీరని అన్యాయం జరిగిందని అన్నారు. ఖాళీగా ఉన్న 23 వేల టీచర్ పోస్టులతో తిరిగి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్రెంటిస్ విధానాన్ని తీసుకురావడం సబబుకాదని అన్నారు. నిరుద్యోగుల నుంచి దరఖాస్తు ఫీజు కూడా భారీగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగాల భర్తీలో ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, జగన్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు నిరుద్యోగులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నరేష్, సాదిక్, రవి, నిఖిల్, భరత్, రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ సొంత డబ్బు ఇస్తున్నారా..?

అభివృద్ధి చేసింది నేనే.. సీఎం కాదు
ఆసరా సభలో రెచ్చిపోయిన ఎమ్మెల్యే కాపు



ఆసరా సభలో పోలీసులతో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి వాగ్వాదం

డి.హీరేహాళ్, ఫిబ్రవరి 15: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జగన్ తన సొంత డబ్బు ఇవ్వడంలేదని, అది ప్రజల సొమ్ము అని రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి కట్టే పన్నులను పథకాల రూపంలో తిరిగి వారికే అందిస్తున్నారని అన్నారు. డి.హీరేహాళ్ మండల కేంద్రంలో గురువారం నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ రెబెల్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. తనకు టిక్కెట్ నిరాకరించిన నేపథ్యంలో సీఎం జగన్‌ను ఎమ్మెల్యే మరోమారు నేరుగా టార్గెట్ చేశారు. నియోజకవర్గాలలో అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేయలేరని, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలమే ఆ పని చేయగలమని అన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ముఖ్యమంత్రి చేసిన అభివృద్ధి ఏమి లేదని అన్నారు. ఏ ప్రొటోకాల్ ప్రకారం మెట్టు గోవిందరెడ్డి ఇలాంటి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని ప్రశ్నించారు. ప్రొటోకాల్ విషయమై మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు కూడా పత్రికా ముఖంగా ప్రశ్నించారని, దానికి అధికారులు సమాధానం చెప్పాలని కాపు డిమాండ్ చేశారు. పద్ధతి ప్రకారం అధికారులను ట్రాన్స్‌ఫర్ చేయడం చూశామని, కానీ ఇక్కడ ఎమ్మెల్యేలను కూడా సీఎం జగన్ ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, ఇలాంటిది తాను ఎక్కడా చూడలేదని ఎద్దేవా చేశారు. రాయదుర్గంలో కూడా మెట్టు గోవిందరెడ్డిని కాకుండా మరో వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించాలని గట్టి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. అసమర్థుడైన మెట్టు గోవిందరెడ్డిని కాకుండా సమర్థుడైన కాలవ శ్రీనివాసులుని గెలిపించాలని కాపు పరోక్షంగా అన్నారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో తానే అభ్యర్థిగా ఉంటానని, కొందరు చేసే ప్రచారాలను నమ్మవద్దని అన్నారు.



కాపు రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న మెట్టు వర్గీయులు

రచ్చ రచ్చ

టీడీపీ ఎంపీటీసీలు గంగాధర, మల్లికార్జున ప్రసంగిస్తుండగా కొందరు వైసీపీ నాయకులు అడ్డుపడ్డారు. మహిళల అభ్యున్నతికి మొట్టమొదట పాటుపడింది ఎన్టీఆర్, చంద్రబాబు అని వారు అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మహిళలకు ఎన్నో రకాలుగా ఉపాధి అవకాశాలు కల్పించామని అన్నారు. దీంతో వారిని వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. మైకు లాక్కునేందుకు ప్రయత్నించారు. దీంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో మెట్టు గోవిందరెడ్డి వర్గీయులు కాపు రామచంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాపు వర్గీయులు అక్కడే ఉన్నా, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు గోవిందరెడ్డి అక్కడే ఉన్నకారణంగా మౌనం వహించారు. మెట్టు గోవిందరెడ్డి సభకు ఏ హోదాలో వచ్చారని కాపు అధికారులను ప్రశ్నించారు. అందరికీ సర్దిచెప్పేందుకు పోలీసులు తంటాలు పడ్డారు.

దేవరకొండ



కొండమీదరాయుడి పండుగ

24న రథోత్సవం

కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 24న శనివారం నిర్వహిస్తారు. జిల్లా నలుమూలల నుంచి, కర్నాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజున రథోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 12 గంటలకు మడగు తేరు, సాయంత్రం 4 గంటలకు ప్రధాన రథోత్సవం ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారి సాకే రమేష్‌బాబు తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు
11 రోజులపాటు వాహన సేవలు
24న ప్రధాన ఘట్టం.. రథోత్సవం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 15: కొండమీద రాయుడి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుక్కరాయసముద్రంలోని దేవరకొండపై వెలసిన స్వామివారి వేడుకలకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల17 నుంచి 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. వేడుకలలో భాగంగా కొండమీదరాయుడు విహరించే 11 వాహనాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈ నెల 24న జరుగుతుంది. యేటా మాఘ మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.



దేవరకొండపై ముస్తాబైన కొండమీద రాయుడు



స్వామి వారి ఉత్సవ మూర్తులు

వాహన సేవలు ఇలా..

- 17న కొండమీద వెంకరమణస్వామి దేవాలయంలో శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పల్లకి సేవ నిర్వహిస్తారు. పురవీధులలో ఊరేగించిన అనంతరం దేవరకొండపైకి తీసుకువెళ్లి ఆలయంలో కొలువుదీరుస్తారు.
- 18వ తేదీ ఉదయం దేవరకొండపై ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేపడుతారు. అదే రోజున బ్రహ్మోత్సవాలకు అంకురారోపణ చేస్తారు. పుణ్యాహ వచనము, ధ్వజారోహణం అనంతరం స్వామివారిని తిరిగి స్థానిక ఆలయం వద్దకు తోడ్కొని వస్తారు. సాయంత్రం పూల పల్లకి సేవ నిర్వహిస్తారు.
- 19న స్వామివారికి సింహ వాహన సేవ నిర్వహిస్తారు. 20న శేషవాహనం, 21న హనుమద్వాహనం, 22న గరుడవాహనం, 23న శ్వేతగజవాహనంపై స్వామివారు విహరిస్తారు.
- 23వ తేదీ అర్ధరాత్రి లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.
- 24న సూర్యప్రభ వాహనంపై విహరించిన అనంతరం రథోత్సవం నిర్వహిస్తారు.
- 25న అశ్వవాహనం, 26న హంస వాహనంపై స్వామివారు విహరిస్తారు. ఇంతటితో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమౌతాయి.



దేవరకొండపై దేవాలయం

పాఠాలు చెప్పాల్సిందే..!

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆర్‌జేడీ హెచ్చరిక



మాట్లాడుతున్న ఆర్‌జేడీ రాఘవరెడ్డి



హాజరైన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15: పిల్లలకు చదువు చెప్పే విషయంలో రాజీ పడేదే లేదని, నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించేది లేదని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ రాఘవరెడ్డి అన్నారు. ఆర్ట్స్ కాలేజీలో జిల్లాలోని ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లలో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. వారిని సూటిగా ప్రశ్నలు అడుగుతూ ఆశ్చర్యానికి గురి చేశారు. జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) 2020 గురించి ఎంతమంది చదివారని ప్రశ్నించారు. కనీసం వార్తా ప్రతికలు, సామాజిక మాధ్యమాల్లోనైనా చూశారా..? ఒక్క పేజీ అయినా చదివారా..? అని అడిగారు. 'మీరు చదువు చెప్పే స్కూళ్లలో మీ పిల్లలను ఎందుకు చదివించడం లేదు?' అని ప్రశ్నించారు. నాడు-నేడులో భాగంగా స్కూళ్లను ప్రభుత్వం ఎందుకు అభివృద్ధి చేస్తోంది..? ఎంత మంది ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా బోధన చేస్తున్నారు..? అని ప్రశ్నలు వేస్తూ ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎన్‌ఈపీ ఇప్పటికే రాష్ట్రంలో అమలవుతోందని అన్నారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఉపాధ్యాయులు కాదని, నాయకుల వంటివారని అన్నారు. నిజ జీవితంలో ఉపయోగపడేలా చదువులు ఉండాలని అన్నారు. 'మన తల్లిదండ్రులు చాలామంది చింత చెట్ల కింద, ఇసుకలో రాసి చదువుకున్నారు. అయినా అనర్గళంగా ఇంగ్లీష్ సైతం మాట్లాడేవారు..' అని గుర్తు చేశారు. విద్యార్థులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సూచించారు. పాఠాలు చెప్పే విషయంలో, లెసన్ ప్లాన్ తయారీలో నిర్లక్ష్యంగా ఉన్న పక్క జిల్లాలోని ఓ టీచర్ ఇంక్రిమెంట్ కోత పెట్టానని తెలిపారు. పాఠాలు బాగా చెప్పలేదని, అరగంట ఆలస్యంగా బడికి వెళ్లాడన్న కారణంగా ఒకనాటి తన విద్యార్థులైన ఉపాధ్యాయులపైనే సస్పెన్షన్, జీతంలో కోత వంటి చర్యలు తీసుకున్నానని వివరించారు. 'తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే' అని హెచ్చరించారు. 'నేను పనిచేస్తున్న పాఠశాలలో నా పిల్లలను ఎందుకు చదివించడం లేదు?' అన్న ప్రశ్నకు సమాధానం వెతుక్కుంటే.. మీరు గుడ్ లీడర్స్‌గా తయారవుతారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం కలెక్టర్ వంటి వారే గేటు వద్ద వెయిట్ చేసేలా తీర్చిదిద్దాలన్నారు. 1960, 70లో ఇలాంటి సంఘటనలు జరిగాయని అన్నారు. అంతకుముందు ఏసీ గోవింద్ నాయక్, ఏడీ నాగరాజు, డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, శ్రీదేవి 10వ తగతి పరీక్షలపై సూచనలు సలహాలు ఇచ్చారు.

టీచర్లపై కేసులు ఎత్తేయండి

సమీక్ష అనంతరం హెచ్‌ఎంలు, ఎంఈఓలకు ఆర్‌జేడీ మాట్లాడే అవకాశం ఇచ్చారు. దీంతో టీచర్లపై ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయాలని హెచ్‌ఎం నరసింహులు కోరారు. ఉద్యమంలో భాగంగా ఆందోళన చేసినప్పుడు టీచర్లపై కేసులు పెట్టారని, మంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లామని అన్నారు. ప్రమోషన్ల సమస్య కూడా కోర్టులో నానుతోందని అన్నారు. కేసు పరిష్కారమైతే సుమారు 250 మందికి ఉద్యోగోన్నతులు వస్తాయని అన్నారు. స్కూళ్లకు వేలకు వేలు కరెంటు బిల్లులు వస్తున్నాయని, కట్టవద్దని మంత్రి సూచించారని అన్నారు. బిల్లులు కట్టనందుకు విద్యుత్ కనెక్షన్‌లను తొలగిస్తున్నారని వివరించారు. తాను ప్రతి నెలా రూ.6 వేలు కడుతున్నానని, మరికొందరు హెచ్‌ఎంలు రూ.12 వేలకు పైగా భరిస్తున్నారని అన్నారు. స్కూళ్ల గ్రాంటు విడుదల చేయాలని కోరారు. నాడు-నేడు పనులు మంచి దశలో ఉన్నాయని, 3వ విడత రివాల్వింగ్ ఫండ్ రావడం లేదని ఓ ఎంఈఓ అన్నారు. వీటికి ఆర్‌జేడీ తల ఊపడం మినహా సమాధానం ఇవ్వలేదు.



ఆర్‌జేడీ వద్ద సమస్యలు ఏకరవు పెడుతున్న హెచ్‌ఎం నరసింహులు



దిన్నెహట్టికి చెందిన కార్యకర్త ముత్తప్ప కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న నారా భువనేశ్వరి



దిన్నెహట్టికి తరలివచ్చిన కార్యకర్తలు నాయకులు

కార్యకర్తలను కాపాడుకుంటాం

కంటికి రెప్పలా చూసుకుంటాం

పురానికి నారా, నందమూరి కుటుంబాలు అండగా ఉంటాయి : నారా భువనేశ్వరి

మూడోరోజు కొనసాగిన నిజం గెలవాలి యాత్ర

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఆర్థికసాయం చెక్కుల పంపిణీ

హిందూపురం/మడకశిర, ఫిబ్రవరి 15: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరి శ్రీసత్యసాయి జిల్లాలో మూడోరోజు గురువారం పర్యటన కొనసాగించారు. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును జీర్ణించుకోలేక మరణించిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన టీడీపీ కార్యకర్త అంజినప్ప.. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించడంతో ఆ కుటుంబానికి నారా భువనేశ్వరి వెళ్లారు. అంజినప్ప చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బయటకు వచ్చి మేడ పైకి వెళ్లి అక్కడికి వచ్చిన జనానికి అభివాదం చేశారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. హిందూపురానికి రావడం సంతోషంగా ఉందనీ, మృతి చెందిన కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చానన్నారు. ఇక్కడ ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకే పట్టం కడుతూ వస్తున్నారన్నారు. తన తండ్రి ఎన్టీఆర్ నుంచి సోదరుడు బాలకృష్ణ వరకు తమ కుటుంబానికి నియోజకవర్గ ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. హిందూపురానికి నారా, నందమూరి కుటుంబాలు ఎప్పుడూ అండగా ఉంటాయని ఆమె తెలిపారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. వారి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. తెలుగుదేశం కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు ఎంత చేసినా తక్కువేననీ, ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. రానున్న ఎన్నికల సంగ్రామంలో దుర్మార్గపు వైసీపీని ప్రజలు ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం క్లిష్టపరిస్థితుల్లో ఉందనీ, ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపడితేనే గాడిలో పడుతుందన్నారు. ఆ దిశగా అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు.

అధైర్యపడకండి..

హిందూపురం నుంచి గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామానికి నారా భువనేశ్వరి వెళ్లారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక దిన్నేహట్టికి చెందిన కార్యకర్త ముత్తప్ప మరణించాడు. దీంతో ఆయన ఇంటికెళ్లి నారా భువనేశ్వరి కుటుంబసభ్యులను పరామర్శించారు. భువనేశ్వరిని చూడగానే కుటుంబసభ్యులు భావోద్వేగానికి లోనయ్యారు. వారిని ఓదార్చి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ముత్తప్ప చిత్రపటానికి నివాళులర్పించారు. రూ.3 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు.

జిల్లాలో ముగిసిన పర్యటన

నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర మూడు రోజులపాటు జిల్లాలో కొనసాగింది. గురువారం ముగిసింది. మడకశిర నుంచి నారా భువనేశ్వరి సాయంత్రం పుట్టపర్తి సత్యసాయి ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలేదేరి వెళ్లారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, మాజీమంత్రులు పరిటాల సునీత, పల్లె రఘునాథ రెడ్డి, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి, పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పురంలో అంజినప్ప చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తూ..



పురంలో చిన్నారికి నామకరణం చేస్తూ...



పుట్టపర్తి విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నేతలు



దిన్నెహట్టిలో కార్యకర్త కుటుంబానికి భరోసానిస్తూ..



పార్టీ వలంటీర్లతో గ్రూప్‌ఫొటో...

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

- రూ.10లక్షల ఆస్తి నష్టం



కూలిన ఇంటి గోడలు

నల్లచెరువు, ఫిబ్రవరి 15: మండలంలోని ఉబ్బిచెర్ల గ్రామంలో చాకలి రెడ్డెప్ప నివాస గృహం గురువారం ఉదయం వంట గ్యాస్ సిలిండర్ పేలి కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఘటనపై బాధితుడు రెడ్డెప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమ కుమార్తె వివాహం అన్నమయ్య జిల్లా ములకలచెరువులో ఉండడంతో అందరం బుధవారం రాత్రి వెళ్లామన్నారు. గురువారం ఉదయం 6గంటల సమయంలో ఇంటిలో వంట గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలిందన్నారు. విషయం తెలియగానే తాము 7గంటలకు వచ్చి చూడగా.. నూతనంగా నిర్మించుకున్న ఇల్లు కూలిపోయిందన్నారు. ఇంటి లోపలిభాగం గోడలు పూర్తిగా పడిపోయాయని, బయటి భాగం గోడలు నెర్రెలు చీలాయని అన్నారు. నివాసం ఉండేందుకు ఆ ఇల్లు పనికిరాదన్నారు. ఇంటిలోని సామగ్రి కూడా పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఈ ఘటనతో దాదాపు రూ.10లక్షల నష్టం వాటిల్లిందన్నారు. కుమార్తె వివాహానికి వెళ్లడంతో అందరం ప్రాణాలు దక్కించుకున్నామన్నారు. విషయంపై నల్లచెరువు పోలీస్‌స్టేషన్‌లోనూ, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సిలిండర్ పేలిన శబ్దానికి భయభ్రాంతులకు గురయ్యామని గ్రామస్థులు అంటున్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయండి

వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: రాబోవు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ శేఖర్‌బాబు ఆదేశించారు. గురువారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల వ్యవసాయ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2023-24 రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల ఈ క్రాపింగ్, ఈకేవైసీ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆర్బీకేల్లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15: దేశవ్యాప్తంగా సెంట్రల్ యూనివర్శిటీలలో ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని ఇండియా ఫర్ ఇండియా ఫౌండేషన్ సలహదారు భరత్ భూషన్ తెలిపారు. నగరంలో ఈ కార్యక్రమ పోస్టర్లను గురువారం విడుదల చేశారు. దేశంలోని అగ్ర శ్రేణి కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులకు ఉచిత కోచింగ్, మెంటరింగ్ సదుపాయం కల్పిస్తామని ఆయన తెలిపారు. కామన్ యూనివర్శిటీ ఎంట్రెన్స్ టెస్ట్ (సీయూఈటీ), కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (సీఎల్‌ఏటీ), నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ), రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఆర్‌ఐఈసీఈఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్‌ఐడీడీఏటీ) వంటి ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. దీంతో పాటు కెరీర్ ప్లానింగ్, సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9177098007 నంబరులో సంప్రదించాలని వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

వెబ్‌సైట్: www.indiaforindiafoundation.org

మెయిల్ ఐడీ: indiaforindiafoundation@gmail.com

భక్తిశ్రద్ధలతో మహాభోగ్

ముగిసిన సేవాలాల్ జయంత్యుత్సవాలు



ఇరుముడి తీసుకెళ్తున్న మాలధారులు





మహాభోగ్‌ను నిర్వహిస్తున్న పీఠాధిపతి రమేష్ గురూజీ

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ముగిశాయి. చివరి రోజు గురువారం స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు. సేవాలాల్ మాలధరించిన భక్తులు ఇరుముడులను సమర్పించారు. మాతా జగదాంబ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయం నుంచి 101 మంది యువతులు బోనాలతో వెళ్లి సేవాలాల్ మహరాజ్‌కు సమర్పించారు. ముగింపు ఉత్సవాల్లో అత్యంత కీలకమైన మహాభోగ్ కార్యక్రమాన్ని రాజస్థాన్ పీఠాధిపతి రమేష్ గూరుజీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షులు కేశవనాయక్, రవీంద్ర నాయక్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థనాయక్, యస్‌కే రామచంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో సేవాలాల్ మహరాజ్, అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న యువతులు

నేడు ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 15: ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ఈనెల 16వతేదీన ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ చదివి 22-32 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, డ్రైవింగ్ లైసెన్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు అనంతపురం, గుంతకల్లు, రాయదుర్గం, తాడిపత్రి, పెనుకొండ, కదిరి, గోరంట్ల, హిందూపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 6305900106, 9550676098లను సంప్రదించాలని కోరారు.

20లోపు వివరాలు నమోదు చేయాలి: డీఈఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 15: జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూళ్లు ఈనెల 20వ తేదీలోపు విద్యాశాఖ పోర్టల్‌లో తమ వివరాలు నమోదుచేయాలని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని స్కూళ్ల గుర్తింపు రద్దు చేస్తామన్నారు.

ఫారం-7 తిరస్కరణపై ఫిర్యాదు



ఎన్నికల అధికారికి వినతి పత్రం ఇస్తున్న బ్యాళ్లరాము

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 15: అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో ఫారం-7 దరఖాస్తులను బీఎల్ఓలు తిరస్కరించారని టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు బ్యాళ్ల రాము అన్నారు. రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి వసంతబాబుని కలసి ఫారం-7 దరఖాస్తుల రద్దు అంశంపై గురువారం ఫిర్యాదు చేశారు. కొడిమిలోని 44, 45 పోలింగ్ కేంద్రాల పరిధిలో స్థానికేతరులు, ఇళ్లు లేనివారి పేర్లను ఓటరు జాబితాలో చేర్చారని అన్నారు. వారి పేర్లను తొలగించాలని కోరుతూ ఫారం-7 కింద 740 దరఖాస్తులు సమర్పించామని, అందులో 340 మాత్రమే తొలగించారని అన్నారు. మిగిలిన వాటిని తొలగించకుండా, దరఖాస్తులను తిరస్కరించారని అన్నారు. దీనిపై బీఎల్‌ఓలు సరైన సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. అధికార పార్టీ వారి ఒత్తిళ్ల కారణంగానే వాటిని తొలగించకుండా అలానే ఉంచారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు వన్నూరు స్వామి, నాయకులు శ్రీకంఠం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధంతో భర్త హత్య

- ప్రియుడితో కలిసి దారుణానికి ఒడిగట్టిన భార్య
- సున్నపుగుట్ట తండాలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



ఖాదర్‌బాషా (ఫైల్)

కదిరి అర్బన్, ఫిబ్రవరి 15: వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మందలించిన భర్తను భార్య ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటన కదిరి మండలంలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సున్నపుగుట్టతండాకు చెందిన ఖాదర్‌బాషా(35), గులాబ్‌జాన్ దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు సంతానం. ఖాదర్‌బాషా ఐషర్ వాహనం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతను గతంలో పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన షేక్ బాబ్‌జాన్ వద్ద అసిస్టెంట్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో బాబ్‌జాన్ తరచూ ఖాదర్‌బాషా ఇంటికి వస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అతడికి గులాబ్‌జాన్‌తో పరిచయం ఏర్పడి, అది కాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. కొద్దిరోజులకు విషయం భర్త ఖాదర్‌బాషాకు తెలియడంతో తరచూ భార్యతో ఘర్షణ పడేవారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరి 31న రాత్రి భార్యా భర్త తీవ్ర స్థాయిలో గొడవ పడ్డారు. గులాబ్‌జాన్ కర్రతో భర్త ఖాదర్‌బాషా తలపై బలంగా కొట్టడంతో అతను కింద పడిపోయాడు. విషయాన్ని ఫోన్‌ద్వారా ప్రియుడు బాబ్‌జాన్‌కు తెలియజేసింది. అతను వచ్చి చూసి ఖాదర్‌బాషా కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించాడు. ఆ తర్వాత ఇద్దరూ కలిసి అతడి గొంతునలిపి చంపారు. అదే రాత్రి పొద్దుపోయాక మృతదేహాన్ని ద్విచక్రవాహనంలో మండలంలోని కారెడ్డిపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి పెట్రోల్ పోసి నిప్పంటించారు. శవం పూర్తిగా కాలకపోవడంతో మిగిలిన భాగాన్ని ప్లాస్టిక్ కవర్‌లో ఉంచి దగ్గరలోని చెరువులో పడేశారు. అనంతరం తన భర్త కనిపించలేదని గులాబ్‌జాన్ ఈనెల 3వతేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు పట్టణంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కాగా గులాబ్‌జాన్‌కు బాబ్‌జాన్‌తో వివాహేతర సంబధం ఉందన్న విషయం తెలుసుకున్న పోలీసులు వారిపై నిఘా ఉంచి తమదైన శైలిలో విచారణ చేశారు. విచారణలో తన భర్తను ప్రియుడితో కలిసి చంపినట్లు గలాబ్‌జాన్ వెల్లడించింది. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నాయకులు సరిపూటి రమణ, దేవళ్ల మురళీ, మారుతీకుమార్ గౌడ్, గోపాల్ గౌడ్, సైఫుద్దీన్ మీడియాతో మాట్లాడారు. నగరంలోని మరువకొమ్మ కాలువ పనుల డిజైన్‌ను మార్చేసి ప్రజాధనాన్ని కాజేయాలని వైసీపీ పాలకులు కుట్రలు చేస్తున్నారని, పనుల్లో అవకతవకలపై శుక్రవారం ఆ పరిసర ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి పర్యటించి ప్రజలకు వివరించనున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలప్ప, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో విఫలం

తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి



మాట్లాడుతున్న విజయశ్రీరెడ్డి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విఫలమయ్యారని తెలుగు మహిళా నగర అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి మండిపడ్డారు. గురువారం స్థానిక అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వేసవి రాక ముందే అనంత అర్బన్‌లోని 50 డివిజన్లు, నాలుగు పంచాయితీల్లో తీవ్రమైన నీటిఎద్దడి ఏర్పడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి రూ.166 కోట్ల ప్రపంచ బ్యాంక్ నిధులతో తుప్పుపట్టిన పైప్‌లైన్‌ను తీసివేసి కొత్త పైప్‌లైన్ ద్వారా 11 వాటర్ ట్యాంక్‌లను నిర్మించి ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుత ఎమ్మెల్యే మోటార్లు మరమ్మతులు చేయించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రజల నీటి కష్టాలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు జానకి, సరళ, సరోజమ్మ, షరీనా తదితరులు పాల్గొన్నారు.

తొలి ఓటు అభివృద్ధికి వేయండి

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: యువత తొలి ఓటును అభివృద్ధికి వేయాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు కోరారు. గురువారం స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఓటు హక్కు కలిగిన విద్యార్థులతో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో కియ పరిశ్రమను ఏర్పాటు చేసి అనేక మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. వైసీపీ పాలనలో యువతతోపాటు అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్ మోసం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో మీ తొలి ఓటు టీడీపీకి వేసి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుంజయనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు కేఎం జకీవుల్లా



రైస్ కుక్కర్లు పంపిణీ చేస్తున్న కేఎం జకీవుల్లా

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధం కావాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు కేఎం జకీవుల్లా పేర్కొన్నారు. గురువారం స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో పేద మహిళలకు రైస్ కుక్కర్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మళ్లీ సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాయల్ మురళీ, వీరాంజినేయులు, కృష్ణకుమార్, మణికంఠ బాబు, మోహన్‌కుమార్, ప్రకాష్, జయరాంనాయక్, లక్ష్మీనాయుడమ్మ, మాధవ్ యాదవ్, పరమేష్, వరణ్‌రెడ్డి, ఉమాదేవి, తిరుపాల్ పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు న్యాయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శాంతారాం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: టీడీపీతోనే నాయీబ్రాహ్మణులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాం అన్నారు. గురువారం అనంతపురం అర్బన్‌లోని పలు ప్రాంతాల్లోని షాపుల వద్దకు వెళ్లి సూపర్ సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కడియాల కొండన్న, సురేంద్ర, సీఎం రాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా



ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్న జనసేన నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 15: నగరంలో తాగునీటి ఎద్దడి దృష్టిలో ఉంచుకొని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ ద్వారా పలు కాలనీల్లో తాగునీటి సమస్యను తీరుస్తున్నారు. గురువారం 5వ డివిజన్‌లోని ఖాజానగర్‌కు చెందిన పలువురు కాలనీవాసులు టీసీ వరుణ్‌కు ఫోన్ ద్వారా సమస్యను తెలుపడంతో ఆయన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా కాలనీకి నీటి ట్యాంకర్లను పంపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, నగర ప్రధాన కార్యదర్శి కుమ్మర నాగేంద్ర, ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్ ఏవీ చలపతి, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ, సిద్దు, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర కార్యదర్శులు కుమ్మర మురళి, అంజి, సంపత్, ఆకుల అశోక్, నాయకులు విజయ్ రాయల్, నౌషాద్, ఉదయ్ పాల్గొన్నారు.

అభివృద్ధి, అవినీతిపై బ్యాలెట్ ఓటింగ్‌కు సిద్ధమా..?

ఎమ్మెల్యే అనంతకు వైకుంఠం ప్రభాకర్ చౌదరి సవాల్



మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 15: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో నేను అభివృద్ధి చేశానా..? నువ్వు చేశావా..? నేను అవినీతి చేశానా..? నువ్వెంత అవినీతి చేశావన్న అంశాలపై వ్యక్తిగతంగా ఓపెన్ బ్యాలెట్ ఓటింగ్‌కు సిద్ధమా..? అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి సవాల్ విసిరారు. గురువారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అనంత అర్బన్‌లో టీడీపీ హయాంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఎమ్మెల్యే అనంత చేసిందేమీ లేదన్నారు. దమ్ముంటే నువ్వు ఫ్యాన్ గుర్తు పక్కన పెట్టు... నేను సైకిల్ గుర్తు పక్కన పెడతా.. ఇద్దరి అభివృద్ధి, అవినీతిపై అనంతపురం అర్బన్ నియోజకవర్గం ప్రజలతో వ్యక్తిగతంగా బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిద్దామన్నారు. ఈ ఓటింగ్‌లో నా కంటే నీకు ఎక్కువ ఓట్లు వస్తే రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, అందుకు నీవు సిద్ధమా..? అంటూ ప్రశ్నించారు.

నేటి నుంచి ప్రజాక్షేత్రంలోకి... మరువకొమ్మ కాలువ పనుల్లో అవకతవకలపై గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేయాలని తాను భావించి పోలీసులను అనుమతి కోరినా ఇవ్వలేదని ప్రభాకర్ చౌదరి అన్నారు. ఎమ్మెల్యే పాతూరులో రోడ్లు బ్లాక్ చేసి సభలు పెట్టుకునేందుకు అనుమతించిన పోలీసులు తన దీక్షకు ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నుంచి నేరుగా ప్రజా క్షేత్రంలోకి వెళ్లాలని నిర్ణయించామన్నారు. మరువకొమ్మ కాలువ పొడవునా ఇళ్ల వద్దకు తాను వెళ్లి గత డిజైన్, మార్పు చేసిన డిజైన్ పనులతో ప్రజలకు కలిగే ఇబ్బందులు, ప్రజాధనం దుర్వినియోగంపై వివరిస్తానన్నారు. నగరంలో 20 రోజులుగా తాగునీటి సమస్య తలెత్తినా ఎమ్మెల్యే పట్టించుకోలేదన్నారు. మోటార్లు పనిచేస్తున్నాయా..? లేదో చూసే తీరిక కూడా లేదా అని నిలదీశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం



వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు ఫిబ్రవరి 15: మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలోని ఉత్సవమూర్తులను కల్యాణకట్టపై ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీవల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి కల్యాణాన్ని ఆలయ ప్రదాన అర్చకులు రాము నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ, తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: మండలంలోని పేరూరు గ్రామంలో పెన్నానది ఒడ్డున వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయంలో ఆలయకమిటీ ఆధ్వర్యంలో షష్టి ఉత్సవాలు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు రామగిరితోపాటు కనగానపల్లి, కంబదూరు, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు.

రేపు జేవీవీ రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర రాక

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర శనివారం అనంతపురం రానుందని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య వెల్లడించారు. గురువారం కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో జేవీవీ నగరాధ్యక్షుడు రామిరెడ్డి, మ్యాజిక్లో జిల్లా కన్వీనర్ ప్రసాద్ సంయుక్త అధ్యక్షతన ప్రిన్సిపాల్ శంకరయ్య కళాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించే కృషిలో భాగంగా జేవీవీ రాష్ట్రస్థాయి కళాయాత్రను నిర్వహిస్తోందన్నారు. ఈనెల 5న శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభమైన కళాయాత్ర జిల్లాల్లో పర్యటిస్తూ, కళాప్రదర్శనలిస్తూ దాదాపు 2వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి శనివారం నగరానికి చేరుకోనుందన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి ఎస్కేయూ రిజిస్ట్రార్ ఎంవి లక్ష్మయ్య, ఐఎంఏ జిల్లా కార్యదర్శి డాక్టర్ అభిషేక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, రాష్ట్రస్థాయి కళాయాత్ర కన్వీనర్ త్రిమూర్తులు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు. అన్నివర్గాలవారు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, ఐక్యూస్ కోఆర్డినేటర్ పర్వీన్, కామర్స్ అధ్యాపకులు ఆదినారాయణ, ధనలక్ష్మి, జేవీవీ నగర నాయకులు సాకే లక్ష్మినారాయణ, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రేడియోతో రైతులది విడదీయలేని అనుబంధం

ఆర్డీటీ హార్టికల్చర్ సలహాదారు నాగేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీటీ హార్టికల్చర్ సలహాదారు నాగేశ్వర్‌రెడ్డి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: రేడియోతో రైతులకున్న అనుబంధం విడదీయలేనిదని ఆర్డీటీ హార్టికల్చర్ సలహాదారు నాగేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన రైతు దినోత్సవానికి ఆయనతోపాటు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీ ఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, పశుసంవర్ధకశాఖ వైద్యుడు సుబ్రహ్మణ్యం, పట్టు పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కేపీ కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంపై అవగాహన పెంచటం, వ్యవసాయ రంగంలో వస్తున్న కొత్తవిధానాలను తెలియజేయడంకోసం ప్రతిఏటా ఫిబ్రవరి 15న రేడియో రైతు దినోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆకాశవాణి ప్రోగ్రాం అధికారి నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రేడియో అన్నదాతకు అండగా నిలుస్తూ, వారికి అవసరమైన సమాచారాన్ని ప్రసారం చేస్తూనే పంటల్లో అధిక దిగుబడులు వచ్చేలా సహకరిస్తోందన్నారు. అనంతరం పంటల సాగులో అధిక దిగుబడులు సాధిస్తున్న ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాధకుమార్, డాట్‌సెంటర్ కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు రథసప్తమి వేడుకలు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ ప్రోగ్రామ్ అసిస్టెంట్ బాబు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జిల్లాకేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో రథసప్తమి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని శారదా బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు ఆదిత్య హృదయస్తోత్ర పారాయణం, యోగాసనాలు, సూర్యనమస్కారాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పండిట్ వేణు, వరప్రసాద్, సుధామణి తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద యోగాకేంద్రం ఆధ్వర్యంలో... రథసప్తమి సందర్భంగా ఆర్ట్స్ కళాశాల బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 5.45 గంటలకు వివేకానంద యోగా కేంద్ర ఆధ్వర్యంలో సామూహిక సూర్యనమస్కారాలు నిర్వహించనున్నట్లు యోగా కేంద్ర జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యోగాభ్యసకులు, శిక్షకులు విజయవంతం చేయాలని కోరారు.

గ్యాస్ ఆధారిత దహన సంస్కారాల యంత్రం ప్రారంభం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: జిల్లాలో తొలిసారిగా గ్యాస్ ఆధారిత దహన సంస్కారాల యంత్రాన్ని ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో గుత్తిరోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌లో రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మించిన గ్యాస్ ఆధారిత పార్థివదేహాల దహన సంస్కారాల యంత్రాన్ని గురువారం సాయంత్రం హరిశ్చంద్రఘాట్ అధ్యక్షుడు తిరువీదుల జగదీష్ నేతృత్వంలో ప్రారంభించారు. కార్యక్రమంలో కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపామచ్చా నరసింహులు, పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం, ఆర్యవైశ్య సంఘాలు పాల్గొన్నారు.

ఆర్ఎంను కలిసిన కార్మిక పరిషత్ కార్యవర్గం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: ఆర్టీసీ కార్మిక పరిషత్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గం గురువారం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనిని మర్యాదపూర్వకంగా కలశారు. కార్మిక పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, ప్రధాన సలహాదారు ఎస్ఎస్ నారాయణ, ఉపాధ్యక్షుడు గోపాల్, ప్రాంతీయ కార్యదర్శి అంజనేయులు, సహాయ కార్యదర్శి సంగప్ప ఆర్ఎంకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన కార్యవర్గాన్ని పరిచయం చేశారు. అనంతరం పీఓ చెంద్రాయుడును కలవడంతోపాటు ఆర్ఎం కార్యాలయ సిబ్బందికి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కార్మిక పరిషత్ సహాయ కార్యదర్శి ఓబులపతి, కోశాధికారి నరసింహులు, ప్రచార కార్యదర్శి పరమేశ్వర్, కార్యనిర్వాహక కార్యదర్శులు భాస్కర్, వెంకటేశులు, పాల్గొన్నారు.

సమాచారం లేకుండా ఓటింగ్ యంత్రాలపై అవగాహనా..?

అభ్యంతరం తెలిపిన టీడీపీ నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 15: సమాచారం లేకుండా గ్రామంలో ఓటింగ్ యంత్రాలపై ఎలా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారని టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మండలంలోని గంగినేపల్లి గ్రామంలో గురువారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై బీఎల్ఓలు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. దీనిపై సమాచారం లేకుండా ఎలా నిర్వహిస్తారని టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు కిష్టప్ప, యూనిట్ ఇన్‌చార్జ్ శేఖర్ అవగాహన కల్పిస్తున్న సిబ్బందికి ప్రశ్నించారు. వైసీపీ వర్గీయులకు మాత్రమే అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని రూపొందించారా.. అని ప్రశ్నించారు. అధికారుల ఆదేశం మేరకే తాము కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వారు సమాధానం చెప్పారు. ఈ విషయమై తహసీల్దార్ హమీద్‌బాషాను వివరణ కోరగా రెండు రోజుల్లో ఈవీఎంలపై అవగాహన పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయని, దీంతో గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించామన్నారు.

ఐఓటీతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 15: ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం జేఎన్‌టీయూలో ఐఓటీ హ్యాకథాన్, మేక్‌స్కిల్ ఇన్నోవేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మమత అధ్యక్షతన జరిగిన శిక్షణ శిబిరాన్ని వీసీ ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ విష్ణువర్ధన్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ప్రొఫెసర్లు రమణారెడ్డి, గిరిప్రసాద్, డాక్టర్ లలిత, డాక్టర్ అరుణమస్తాని, గిరిధర్ పాల్గొన్నారు.

మొక్కలునాటి పరిరక్షించాలి... మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని వీసీ శ్రీనివాసరావు సూచించారు. వర్సిటీ ఆవరణంలోని హంపీ హాస్టల్ సమీపంలో కొబ్బరి మొక్కలను ఆయన నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ శశిధర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, ప్రొఫెసర్లు బాలనరసయ్య, మాధవి, రామశేఖర్‌రెడ్డి, దిలీప్‌కుమార్, జోజిరెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో కణతి తొలగింపు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15: కేన్సర్ కణతి తొలగించి ఓ రోగి ప్రాణాలను జిల్లా సర్వజన ఆస్పత్రి వైద్యులు కాపాడారు. వివరాలను గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు వెల్లడించారు. నగరానికి చెందిన 60 సంవత్సరాల సుధాకర్ ఆస్పత్రికి వచ్చాన్నారు. పరీక్షల అనంతరం ఊపరితిత్తుల్లో కేన్సర్ కణతి ఉన్నట్లు వైద్యులు గుర్తించడం జరిగిందన్నారు. తొలిసారిగా సిటీగైడెడ్ లంగ్‌బయాప్సీ చేశారని, గురువారం ఆపరేషన్ చేసి కణతిని తొలగించారన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రొఫెసర్ సురేష్ పాల్గొన్నారు.

వైద్య పథకాలను అమలు చేయండి: డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15: ప్రజల ఆరోగ్యం కోసం అమలు చేస్తున్న వైద్యపథకాలను పక్కాగా అమలు చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ బీ దేవి ఆదేశించారు. గురువారం జిల్లా కార్యాలయంలో నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. ఓపీ సేవలు, ల్యాబ్‌పరీక్షలు, తదితర వివరాలు పక్కాగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇందులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు,

'సేవాలాల్ వేడుకలను ప్రభుత్వం నిర్వహించాలి'

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్ కోరారు. గురువారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో మీడియాతో మాట్లాడుతూ సేవాఘడ్‌లో ప్రతియేటా జయంతిని నిర్వహిస్తున్నారని, వీటిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం హర్షణీయమన్నారు. అయితే అభివృద్ధి పనులకోసం నిధులు అవసరమని ట్రస్టుసభ్యులు కోరడం జరిగిందన్నారు. వారి విన్నపాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, బంజారా సంఘాల నాయకులు శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: ఎన్నికల బాండ్లను రాజ్యాంగ విరుద్ధంగా పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో దొంగడబ్బు, నల్లధనం విచ్చలవిడిగా ప్రవహిస్తోందని విమర్శించారు. అధికార పార్టీలకు, పెట్టుబడిదారులు వారి ప్రయోజనాలు ప్రోత్సహించే అభ్యర్థులకోసం ఈ డబ్బును వెదజల్లి ఓట్లు కొనుగోలు చేసి ప్రజాతీర్పును తలకిందులు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇలాంటి తీర్పు చాలా ప్రత్యేకతను సంతరించుకుంటుందన్నారు. ఏ కంపెనీ అయినా, ఏ వ్యక్తైనా ఎవరికి ఎంత డబ్బు ఇస్తున్నాడో, ఆ పార్టీ ఎంత ఖర్చు పెడుతోందో లెక్క ఉంటేనే నల్లధనం ప్రవాహాన్ని అడ్డుకోగలమన్నారు. కేంద్ర, రాష్ట్ర అధికార పార్టీలు ప్రత్యర్థి పార్టీలపైకి ఈడీ, ఐటి వంటి సంస్థలను ప్రయోగించి వారివద్దనున్న డబ్బును లాక్కోవడం, తమ పార్టీ అభ్యర్థులు పెట్టే ఖర్చులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛగా వదిలేయడం జరుగుతోందన్నారు. అన్ని పార్టీలకు ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు ఒకే విధమైన విధివిధానాలు ఉంటే ఎన్నికల్లో సంస్కరణల్లో ఒక ముఖ్య భాగం పూర్తవుతుందని, ఆ దిశగా సుప్రీంకోర్టు కూడా చొరవ తీసుకుని నియమ నిబంధనలు రూపొందించాలని కోరారు.

ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొన్న ఆటో

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 15: నిలిచి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఓ ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని చిన్నపరెడ్డిపల్లి క్రాస్ వద్ద గురువారం చోటు చేసుకుంది. అనంతపురం నుంచి పీఓపీసీట్ల లోడుతో ఆటో పుట్టపర్తికి వెళ్తోంది. ధర్మవరం నుంచి గోరంట్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు చిన్నపరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆగింది. ఆగివున్న బస్సును ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఎర్రిస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను వెంటనే స్థానికులు 108లో ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

దేశవ్యాప్త బంద్‌కు మద్దతు: సీపీఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం చేపట్టనున్న దేశవ్యాప్త బంద్‌కు సీపీఎం మద్దతు ఇస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసగిస్తోందని విమర్శించారు. మతోన్మాదాన్ని పెంచి ప్రోత్సహిస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలపై రైతు, కార్మిక, ప్రజాసంఘాలు శుక్రవారం తలపెట్టిన ఆందోళనలో సీపీఎం శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మోదీకి కార్మికుల చేతిలో గుణపాఠం తథ్యం

అనంతపురం విద్య: మోదీకి కార్మికుల చేతిలో గుణపాఠం తథ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ పేర్కొన్నారు. గురువారం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం జిల్లాలో గ్రామీణ బంద్ పాటించనున్నట్లు తెలిపారు. జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీరాములు, సంతోష్, నాగరాజు, కుళ్లాయిస్వామి, అల్లిపీరా, చెన్నకేశవులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి: సీఐటీయూ

అనంతపురం కల్చరల్: హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా చేపట్టే బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో తపోవనం సర్కిల్ నుంచి 4వ రోడ్డు కూడలి వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడుతూ పెరిగిన డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, ఆటో కార్మికులపై పన్నుల భారం తగ్గించాలని తదితర డిమాండ్ల సాధనకోసం దేశవ్యాప్తంగా బంద్‌ను పాటించనున్నట్లు తెలిపారు. ఆటోడ్రైవర్లతోపాటు అన్నిరంగాలవారు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్టీఆర్ శీన, నాగరాజు, శివప్రసాద్ పాల్గొన్నారు.

శింగనమల: గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి చిన్నప్పయాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం తరిమెల గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. శుక్రవారం నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి భాస్కర్ కోరారు.

'ఎస్సీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేయండి'

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 15: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇవ్వాలని ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్‌కమిటీ సభ్యుడు నెరమెట్ల యల్లన్న ఎస్సీ సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావ్‌ను కోరారు. గురువారం ఆయన జేడీ చాంబర్‌లో మధుసూదన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం యల్లన్న మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీఎస్టీ విద్యార్థులు, నిరుద్యోగ, యువతీ యువకులు స్టడీ సర్కిల్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎస్సీ ఇతర నోటిఫికేషన్ల నేపథ్యంలో ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో డబ్బులు వెచ్చించి శిక్షణ తీసుకోలేకపోతున్నారన్నారు. వెంటనే స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి ఉచిత శిక్షణ ఇవ్వాలని కోరారు. ఎస్సీఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజనేయులు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నగేష్ జేడీని కలశారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 15: ఆఫీస్ ఆటోమేషన్ కోర్సుకు ఈనెల 29వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని శ్రీ విజయ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ వెంకటేశులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలకు పది, ఇంటర్, డిగ్రీతోపాటు ఆఫీస్ ఆటోమేషన్ కంప్యూటర్ కోర్సు అర్హతగా ఉందన్నారు. మార్చి 26 పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 9440323907, 8341882679 నెంబర్లను సంప్రదించాలన్నారు.

మరింత బాధ్యతగా పనిచేయాలి: జేసీ

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 15: వలంటీర్లు మరింత బాధ్యతగా పనిచేయాలని జేసీ కేతన్‌గార్గ్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో వలంటీర్లకు అభినందనసభ నిర్వహించారు ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందిస్తున్న వలంటీర్లను సత్కరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయటంలో వలంటీర్ల పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్పీచైర్‌పర్సన్ బోయగిరిజమ్మ, నగరపాలక కమీషనర్ మేఘస్వరూప్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్టు

శింగనమల, ఫిబ్రవరి 15: మండలంలోని నిదనవాడ గ్రామంలో కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఉదయం సమాచారం రావడంతో ఎస్ఐ, సిబ్బంది స్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. వారి నుంచి ఒక ఇన్నోవా కారు, కోడిపుంజు, ఏడుమొబైళ్లు, మూడుకత్తులతోపాటు రూ.70470 స్వాధీనం చేసుకున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో మాసుమాబీబీ గంధం ఉరుసు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 15: జిల్లాకేంద్రంలో పాతూరు స్వర్ణకారుల వీధిలోని సయ్యదా మాసుమాబీబీ దర్గాలో గురువారం గంధం ఉరుసు వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆదోనికి చెందిన హజరత్ సయ్యద్ లతీఫ్ అహ్మద్ ఖాద్రి, బనగానపల్లెకు చెందిన హజరత్ సయ్యద్ హుస్సేన్ బాద్‌షా ఖాద్రి నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గంధం ఊరేగింపును పురవీధుల్లో చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ నిర్వాహకులు మాబు, జావేద్, లతీఫ్, ముజవర్ జిలాన్ పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

17 తులాల బంగారు నగలు మాయం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 15: పెళ్లికి వెళ్లిన ఓ కుటుంబం 17తులాల బంగారు ఆభరణాలు పోగొట్టుకుంది. అద్దె కారులో ఆ బంగారు నగలు మరిచిపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగరంలోని మూడో రోడ్డుకు చెందిన వేంకటేశ్వర్లు తన కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 11న నగర శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పెళ్లికి ఓ అద్దె కారు తీసుకొని వెళ్లారు. పెళ్లి తంతు ముగించుకొని వచ్చాక రాత్రి సమయంలో చూసుకుంటే 17 తులాల బంగారు ఆభరణాలున్న బ్యాగు కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు బంధువులతో ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ తెలియకపోవడంతో పెళ్లికి వెళ్లిన కారులోనే మరిచిపోయామని భావించారు. గురువారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ధరణికిషోర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అద్దె కారు వారితో మాట్లాడితే తమకేమీ తెలియదని చెప్పుకొచ్చినట్లు తెలిసింది.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

నగర శివారులోని ప్రసన్నాయపల్లి సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. తిరుపాల్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి 15టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీలో చేరిన డాక్టర్ నీలకంఠారెడ్డి



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న నీలకంఠారెడ్డి

కణేకల్లు, ఫిబ్రవరి 15: మండలంలోని సొల్లాపురం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు డాక్టర్ నీలకంఠారెడ్డి గురువారం టీడీపీలో చేరారు. విజయవాడలోని ఉండవల్లిలో అధినేత చంద్రాబాబునాయుడు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మేధావులంతా పార్టీలోకి రావడం వల్ల టీడీపీ మరింత బలోపేతం అవుతుందని చంద్రబాబు నీలకంఠారెడ్డితో అన్నట్లు తెలిపారు. మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నీలకంఠారెడ్డి టీడీపీలో చేరారు. సొల్లాపురంలో వైసీపీ బలంగా ఉండగా ఇటీవలే ఆ గ్రామ ఎంపీటీసీ కేశవరెడ్డితో పాటు పలువురు నాయకులు టీడీపీలో చేరారు. తాజాగా నీలకంఠారెడ్డి కూడా చేరడంతో ఈ ప్రాంతంలో పార్టీకి మరింత బలం పెరిగే అవకాశం ఉంది.

కార్యకర్తలే నా బలం: జేసీ ప్రభాకర్ రెడ్డి



గ్రామస్థులతో కలిసి వస్తున్న జేసీపీఆర్

పెద్దపప్పూరు, ఫిబ్రవరి15: కార్యకర్తలే తన బలమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలో ఆయన చేపట్టిన యువచైతన్య బస్సుయాత్ర గురువారం మూడవరోజుకు చేరుకుంది. మండలంలోని చీమల వాగుపల్లి, అగ్రహారం, వెంగంపేట, నరసాపురం, పెండేకల్లు, కుమ్మెత, సుంకేసులపల్లి, పసలూరు గ్రామాల్లో బస్సుయాత్ర నిర్వహించారు. జేసీ ప్రభాకర్‌రెడ్డికి ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని ప్రజల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. సైకో పాలనకు ప్రజలు చరమగీతం పాడతారని అన్నారు. అంతకుమునుపు నరసాపురం గ్రామంలో పలువురు చేనేత కార్మికులు తమ సమస్యలను ఆయనకు విన్నవించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రఘునాయుడు, భాస్కర్‌రెడ్డి, బీసీ రామకృష్ణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, దినేష్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, గంగరాజు, తలారి క్రిష్ణయ్య పాల్గొన్నారు.

దళితులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం



పయ్యావుల శ్రీనివాసులును సన్మానిస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 15: సంక్షేమ పథకాలను రద్దు చేసి దళితులను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు విమర్శించారు. అనంతపురంలో ఎమ్మెల్యే స్వగృహంలో గురువారం టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు శ్రీనివాసులును కలిశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఎస్సీ సెల్ నాయకులు సుధాకర్, ఓబులేసు, లీలాధర్, పవన్, విరుపాక్షి, ఉపేంద్ర, వినోద్, సురేష్, అనిల్ పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదాం



కరపత్రాలను ప్రదర్శిస్తున్న హనుమంతరాయచౌదరి, టీడీపీ నాయకులు

కుందుర్పి, ఫిబ్రవరి 15: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంతరాయచౌదరి పిలుపునిచ్చారు. గురువారం కరిగానపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ చిత్రలింగప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ నాయకులతో కలసి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. అలాగే చీరలు పంపిణీ చేశారు. గొల్ల వెంకటేశులు, గాజుల శ్రీరాములు, ఉన్నం హనుమంతరాయచౌదరి కోడలు ఉన్నం వరలక్ష్మీ, మాజీ జడ్పీటీసీ మల్లికార్జున, మాజీ కోఆప్షన్ మెంబర్ తాహిర్, రాఘవేంద్రబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



దాసరి రాజు (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 15: పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద బైపాస్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు దేవి బ్రహ్మకాలనీకి చెందిన దాసరి రాజు (35) మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు మరమ్మతులు చేస్తూ జీవనం సాగించేవాడన్నారు. తనకు కావలసిన సామాన్లను తీసుకురావడానికి ద్విచక్రవాహనంలో అనంతపురం వెళ్లి మరో రెండు నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన సమయంలో మృత్యువు కబళించింది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైపాస్‌లో విగతజీవిగా పడి వున్నాడు. అటుగా వెళ్లిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అదే సమయంలో అనంతపురం నుంచి వస్తున్న అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రామాంజినమ్మ, కూతురు బేబీ, కుమారుడు విజయ్ వున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో ఆరునెలల జైలు

తాడిపత్రి, ఫిబ్రవరి15: వివిధ దొంగతనాల్లో ప్రధాన నిందితుడు సుభాష్‌కు గురువారం ఆరునెలల జైలు శిక్షను న్యాయాధికారి చంద్రశేఖర్ రెడ్డి విధించినట్లు పోలీసులు తెలిపారు. నార్పల మండలానికి చెందిన సుభాష్ ఏడాదిక్రితం తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లోని ఇళ్లలోకి చొరబడి బంగారు, నగదును దోచుకెళ్లాడని ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వాటిలో యల్లనూరు మండలకేంద్రంలోని బీసీ కాలనీలో కోలాటం వరలక్ష్మి ఇంటిలో తులం బంగారంతోపాటు రూ.20వేల నగదు అపహరించగా, తాడిపత్రి మండలం చిన్నపొలమడ, పుట్లూరు మండలకేంద్రంలో ఇళ్లలో చొరబడి దొంగతనం చేశాడు. ఆయా కేసుల్లో నిందితుడిని అరెస్ట్‌చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం న్యాయాధికారి ఆరునెలల జైలుశిక్ష విధించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పుట్లూరు, ఫిబ్రవరి 15: మండలకేంద్రంలోని చింతకుంట గ్రామశివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి సీజ్‌చేసినట్లు పోలీసులు తెలిపారు. తాడిపత్రి నుంచి అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించామని, అనంతరం మైన్స్ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

గడ్డివామికి నిప్పు

కుందుర్పి, ఫిబ్రవరి 15: మండలంలోని రుద్రంపల్లి గ్రామానికి చెందిన రైతుకు సంబంధించిన గడ్డివాముకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారున ఏర్పాటు చేసుకున్న పశువుల పాకలో వున్న గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. చుట్టుపక్కల వారు గమనించి అక్కడే వున్న పశువులను కాపాడారు. గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ రైతుకు రూ.60 వేల వరకు నష్టం జరిగినట్లు రైతు ఆందోళన చెందారు.



పోలీసు వాహనాన్ని అడ్డుకుంటున్న కార్మికులు



సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులును స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

శ్రీరామిరెడ్డి కార్మికులపై వైసీపీ నాయకుల దౌర్జన్యం

- పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న కార్మికులు
- పంప్‌హౌస్ అద్దాలు పగులగొట్టిన వైసీపీ నాయకులు
- అధికారుల హామీతో సద్దుమణిగిన సమస్య

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 15: శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు నాల్గవ రోజు సమ్మె ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం పంపుహౌస్ ఎదుట సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులుతో కలసి మోటార్లు ఆఫ్ చేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని నిరసన తెలుపుతున్న వారిని నిలువరించేందుకు ప్రయత్నించగా నాయకులు, కార్మికులు ప్రతిఘటించి పోలీసులు వాహనాలకు అడ్డుగా పడుకుని ప్రతిఘటించారు. వారి వాహనాలు వెళ్లకుండా కార్మికులు నీటి పైపులతో అడ్డుకట్ట వేశారు. దీంతో పోలీసులకు కార్మికులకు తోపులాట జరిగింది. పోలీసుల ఒత్తిడికి తట్టుకోలేక కార్మికులు, నాయకులు పంపుహౌస్‌లోకి వెళ్లి షట్టర్ రెండు వైపులా మూసివేసి నిరసన తెలిపారు. కొంతసేపటికే ఎంపీ తలారి రంగయ్య వర్గీయులు, వైసీపీ నాయకులు అక్కడికి చేరుకుని బయట నుంచి కార్మికులపై పరుష పదజాలంతో కొంతమంది వైసీపీ నాయకులు పంపుహౌస్ భవనానికి ఉన్న అద్దాలను పగలగొట్టి బెదిరింపులకు గురిచేసినా కార్మికులు ససేమిరా అన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్ఈ ఎస్సాన్ బాషా, నాయకులు ఓబుళు, నాగేంద్రతో చర్చలు జరిపి రెండు వారాల్లోగా సమస్యను తీరుస్తామని హామీ ఇవ్వడంతో షట్టర్లు తీశారు. అక్కడున్న సీఐటీయూ నాయకులతో పాటు కార్మికులను వాహనంలో పట్టణ పోలీస్ స్టేషన్‌కి తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

నేటి నుంచి డ్రైవర్లు, క్లీనర్ల సమ్మె

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15: గుంతకల్లు న్యూఐఓసీ డిపో నుంచి గుత్తి, కడప, చిత్తూరు డిపోల నుంచి పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే ట్యాంకర్ల డ్రైవర్, క్లీనర్లు గురువారం అర్ధరాత్రి నుంచి సమ్మెలో పాల్గొంటారని ప్రైవేట్ ఆయిల్ ట్యాంకర్స్ డ్రైవర్స్, క్లీనర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కఠినమైన శిక్షలు, జరిమానాలు విధించే ఎంవీ యాక్టు సవరణ చట్టాన్ని రద్దు చేయాలన్నారు. రవాణా రంగంలోని డ్రైవర్లకు కనీస వేతనం రూ.34వేలు, క్లీనర్‌లకు రూ.26వేలు ఇవ్వాలన్నారు. డ్రైవర్లకు, క్లీనర్లకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి, రవాణా రంగ కార్మికులందరికీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సమ్మెలో వెళ్తున్నట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

నేటి నుంచి కంటి ఆపరేషన్లు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నుంచి కంటి ఆపరేషన్లు ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి ఏఓ రామప్రసాద్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రిలో భవన నిర్మాణాల పనుల కారణంగా కొద్ది రోజులుగా ఆపరేషన్లు బంద్ చేశామన్నారు. జిల్లా వైద్యాధికారుల అనుమతితో కంటి ఆపరేషన్లను ప్రారంభిస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 15: పట్టణంలోని సాయిబాబా మందిరం రోడ్డులో ఉన్న శ్రీ సత్యసాయి లక్ష్మీనారాయణస్వామి వృత్తి విద్య శిక్షణ కేంద్రంలో గురువారం మగ్గం, జర్దొసి వృత్తి విద్యకు సంబంధించి ఉచిత శిక్షణ ప్రారంభమైందని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి గంగాధర్ తెలిపారు. బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో స్థానిక వృత్తి విద్య శిక్షణ కేంద్రం సహకారంతో 65మంది మహిళా యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామారావు హాజరయ్యారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి నాగప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కమ్యూనిటీ హాల్‌లో గురువారం శ్రీ వెంకటేశ్వర భక్త మండలి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కడపలోని పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు వంద మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. మరి కొంత మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వీరిని పుష్పగిరి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేస్తారు. దాతలు విశ్రాంత హెచ్ఎం శ్రీశైలం వెంకటేశులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాస్కర్‌రంగయ్య, సెక్రటరీ నారాయణ స్వామి, ప్రసాదకమిటీ చైర్మన్ జయంతివెంకట్, సభ్యులు సుదర్శన్‌బాబు, రవి, వెంకటేశ్వర్లు, రంగస్వామి, నందీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

పఠన సామగ్రి పంపిణీ

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 15: మండలంలోని లక్షుంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఇదే గ్రామానికి చెందిన బాల ఓబులరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుమారుడు శంకర్‌రెడ్డి రూ.20 వేలు విలువచేసే పఠన సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ మనం సంపాదించిన ధనంలో విద్యార్థులకు, నిరుపేదలకు సాయం కోసం వెచ్చించడం సంతోషదగ్గ విషయమన్నారు.

కబడ్డీ పోటీలకు రాయలచెరువు విద్యార్థిని

యాడికి, ఫిబ్రవరి15: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు రాయలచెరువులోని సీవీఆర్ హైస్కూల్ విద్యార్థిని ప్రవీణ ఎంపికైనట్లు కరస్పాండెంట్ లారెన్స్‌బాబు తెలిపారు. ఆంధ్రకబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గుంతకల్లులో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో ప్రవీణ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

చేనేతలకు ముద్ర రుణాలు ఇవ్వాలి

యాడికి, ఫిబ్రవరి 15: నిబంధనల సడలించి చేనేతలకు ముద్ర రుణాలు ఇవ్వాలని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ నీలూరు రుషింగప్ప కోరారు. గురువారం యాడికిలో చేనేత కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేనేత కార్మికులకు ముద్ర రుణాలను విరివిగా ఇస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదన్నారు. అనంతరం కెనరాబ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

రస్తా ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

యాడికి, ఫిబ్రవరి 15: మండలంలోని పెద్దపేట గ్రామ వ్యవసాయ తోటలకు వెళ్లే రస్తాను కొందరు ఆక్రమించారని, వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు గురువారం తహసీల్దార్ మోహనవల్లికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెద్దపేట గ్రామంలో వ్యవసాయ తోటలకు వెళ్లే రస్తాను కొందరు ఆక్రమించారని తెలిపారు. ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్‌చేశారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ ఈశ్వరయ్య, అధికారులు తనిఖీ చేశారు. ఈవోఆర్డీ దాసానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటనాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు, పెద్దపప్పూరు పోలింగ్ కేంద్రాలను గురువారం పెద్దవడుగూరు సీఐ, పెద్దపప్పూరు ఎస్ఐ శరత్‌చంద్ర పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, ర్యాంప్ సౌకర్యం తదితర వాటిని కల్పించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే గొల్ల నరసింహులు, లలితమ్మ దంపతులకు చెందిన నాలుగేళ్ల రామ్మూర్తికి బ్రెయిన్ సంబంధిత వ్యాధి సోకి క్రమంగా మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్ కావడంతో అచేతనస్థితిలో ఉన్నాడు. ప్రస్తుతం వైద్యానికి సరిపడా ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతుండగా గ్రామస్థుల ద్వారా ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టును సంప్రదించగా ట్రస్ట్ చైర్మన్ బద్దేనాయక్ రూ.15 వేలు చెక్కును, రూ.8 వేలు విలువచేసే నిత్యావసర సరుకులను ఆ కుటుంబానికి అందజేశారు. ట్రస్టు సభ్యులు ములకలేడు సాయినాథ్, లోకేష్, మహేష్, సాయి, బ్రహ్మసముద్రం తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన బీర పంట



నేలకొరిగిన బీరపంట చూపుతున్న రైతు శ్రీనివాసరెడ్డి

బెళుగుప్ప, ఫిబ్రవరి 15: మండలంలోని నక్కలపల్లిలో ఈదురుగాలులకు రైతు శ్రీనివాసరెడ్డికి చెందిన రెండు ఎకరాలలో బీర పంట నేల కొరిగింది. బాధిత రైతు మాట్లాడుతూ నాలుగు ఎకరాలలో పంట సాగు చేయగా గాలులకు బుధవారం రాత్రి చెట్లన్నీ నేలకొరిగాయని తెలిపాడు. రూ.2 లక్షల పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఉద్యాన శాఖ అధికారులు గురువారం పరిశీలించి పంట నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదించారు.

దళిత గర్జనను జయప్రదం చేయండి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 15: రాయదుర్గం పట్టణంలో శుక్రవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గర్జన సభకు పార్టీ దళితశ్రేణులు హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున కోరారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులను ఒక ఓటు బ్యాంకుగా వాడుకొని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసగించారని ఆరోపించారు. ఎర్రగుంట్ల వెంకటేశులు, పయ్యావుల నాగరాజు, పయ్యావుల మోహన్, సల్లాపురం బాబు, నవీన్, సంగప్ప, సైకిల్‌షాపు హనుమంతు పాల్గొన్నారు.

గేట్స్ అటానమస్ పరీక్ష ఫలితాలు విడుదల

గుత్తి, ఫిబ్రవరి 15: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అటానమస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ జయలక్ష్మీ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శాంతి వెల్లడించారు. గేట్స్ కళాశాల అటానమస్ అయిన తరువాత మొదటి ఫలితాలు ఇవేనని కళాశాల ఎండీ రఘునాథ్ రెడ్డి తెలిపారు. మొదటి బీటెక్ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో 60.74శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. కేవలం 15రోజుల్లో పేపర్ వాల్యూషన్ చేసి ఫలితాలు వెల్లడించడం విశేషమన్నారు. కళాశాల డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ సూరయ్య, ఏఈ ఇంతియాజ్ బాషా పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

పుట్లూరు, ఫిబ్రవరి15: మండలకేంద్రంలోని గ్రంథాలయాన్ని గురువారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ పన్ను వసూలుకు కృషిచేయాలన్నారు. ఆమె వెంట గ్రంథాలయాధికారి జయరాములు ఉన్నారు.

యల్లనూరు: స్థానిక గ్రంథాలయాన్ని గురువారం జిల్లా కార్యదర్శి రమ తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సభ్యుల చేరికపై దృష్టి సారించాలని లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డికి సూచించారు. అనంతరం పుస్తకాలను పరిశీలించారు. సౌకర్యాలపై పాఠకులతో ఆరాతీశారు.

ప్రైవేటు స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 15: ఉరవకొండ పట్టణంలో ఏవీఆర్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఐక్యవిద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం సంఘాల నాయకులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఏవీఆర్ స్కూల్ బస్సు కండిషన్ లేక పోవడంతో బోల్తా పడిందన్నారు. విద్యార్థుల జీవితాలతో స్కూల్ యాజమాన్యం చెలగాటం ఆడుతోందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆల్‌ఇండియా ఎస్సీఎస్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు మద్దలచెరువు వెంకి, రాజశేఖర్, హరూన్‌రషీద్, రాము, సింహాద్రినాయక్, మురళి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 15: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం నందలపాడులోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్షుడు రఘురామిరెడ్డి మాట్లాడుతూ పీఎఫ్ ఖాతాలోని సొమ్మును చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేస్తోందన్నారు. డీఏ, సరెండర్‌లీవ్, 11వ వేతన సవరణ బకాయిలు చెల్లించడంలో కూడా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. 24న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు శివయ్య, జయచంద్ర, రామాంజనేయులు, లావణ్య, సాయిలీల, దివ్య భారతి పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

రాయదుర్గంరూరల్: ఆర్టీసీ ఉద్యోగులు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని జేఏసీ చైర్మన్ కెంచె లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. జేఏసీలో భాగంగా ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ నల్లబ్యాడ్జీలు ధరించి డిపో వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కెంచె లక్ష్మీనారాయణ, ఎన్ఎంయూఏ రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరీ నాగరాజు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అన్ని శాఖలలోని ఖాళీలను భర్తీ చేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, కారుణ్య నియమకాలు చేపట్టాలని, జీఓ నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. జిలాన్, తిప్పేస్వామి, దాదాపీరా, సతీష్‌కుమార్, షేక్షావలి పాల్గొన్నారు.



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు



రాయదుర్గంలో ఆర్టీసీ డిపో వద్ద కార్మికుల నిరసన

శ్రీరామిరెడ్డి కార్మికులకు అండగా ఉంటాం

- టీడీపీ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు



ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ యషాన్‌బాషాతో వాదిస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 15: శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలు పరిష్కరించేవరకు టీడీపీ అండగా ఉంటూ, వారికోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు అన్నారు. గురువారం పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్ వద్ద కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా కార్మికులు సమ్మె చేస్తున్నా, పోలీసులు, వైసీపీ నాయకులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కార్మికులపైనే వైసీపీ నా యకులు దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కార్మికుల కడుపు కొడుతున్నారని మండిపడ్డారు. అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ యషాన్‌బాషా, పట్టణ సీఐ హరినాథ్‌తో ఉమామహేశ్వరనాయుడు వాగ్వాదానికి దిగారు. ఇన్నిరోజులుగా సమ్మె చేస్తున్నా, వారికి వేతనాలు మం జూరు చేయడంలో ప్రభుత్వం వైఫలం చెందిందని విమర్శించారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో కాసేపు గందరగోళ వాతావరణం నెలకొంది.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలి



ఈఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 15: పారదర్శక ఓటర్ల జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలని ఈఆర్వో శిరీష కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించారు. తుది ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీ, మరణించిన ఓట్లను అలాగే ఉన్నాయని పలువురు నాయకులు ఈఆర్వో దృష్టికి తీసుకువచ్చారు. ఓటర్ల సవరణ కార్యాక్రమం చేపట్టిన ఏమి ప్రయోజనమన్నారు. ఫారం-6కు సంబంధించి అవకతవకలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఫారం-7కు 2068 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఈఆర్వో తెలిపారు. డబుల్ ఎంట్రీ ఓట్లను తొలగించాలని టీడీపీ నాయకులు రామాంజనేయులు, రాజేష్, ప్యారం భరత్ ఈఆర్వోకు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు గోవింద్, ఓబన్న, రంగారెడ్డి, మధు, విరుపాక్షి, శ్రీనా, ఓబులేసు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవం



పూజల్లో పాల్గొన్న కాలవ భరత్

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 15: మండలంలోని 75 వీరాపురం తండాలో గురువారం సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సేవాలాల్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ యువనాయకుడు కాలవ భరత్ హాజరు కాగా అక్కడి గ్రామ ప్రజలు ఆయనను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ నాగరాజు, తెలుగుయువత గోనబావి రమేష్, మాజీ సర్పంచ్ రంగస్వామి పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్ల, ఆర్‌బీవంక, గ్రామదట్ల తదితర గ్రామాల్లో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించుకున్నారు. సేవాలాల్ గుడి వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సేవాలాల్ చిత్రపటాన్ని పురవీధులలో ఊరేగించారు.

దేవాలయ భూములను పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విశ్వహిందూపరిషత్ నాయకులు

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 15: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ వద్ద నున్న ఆలయ భూములను పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దేవరెడ్డిపల్లి రాజేష్ కోరారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చిట్టిబాబుకు వినతిపత్రం అందించారు. పట్టణంలోని బడుగు బలహీనవర్గాలవారికి ఇంటి పట్టాల కోసం సేకరించిన భూమిని స్థానిక పురపాలక సంఘంవారు రెవెన్యూ ఆధీనంలో ఉన్న భూమిని నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేట్ వ్యక్తులకు భూమిని కేటాయిస్తూ తీర్మానం చేయడం దురదృష్టకరం అన్నారు. ఈ స్థలాన్ని అప్పగించడానికి పురపాలక సంఘం చేసిన తీర్మానం చట్టవిరుద్ధంగా ఉందని, దీనిని వెంటనే వెనక్కి తీసుకుని ఇంటి పట్టాల కోసం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం సత్యనారాయణ, పేర్మి శ్రీనివాసులు, ఆనంద్, వినోద్, ప్రశాంత్, మహేష్ పాల్గొన్నారు.


'చెట్లను నరికి మా కడుపు కొట్టొద్దు'



ఎంపీడీఓకు సమస్యను వివరిస్తున్న మాజీ ఎంపీపీ, గొర్రెల కాపరులు

యాడికి, ఫిబ్రవరి 15: మండలంలోని రాయలచెరువు గ్రామ చెరువులో చెట్లను నరికి మా జీవనంపై దెబ్బ కొట్టవద్దని పలువురు గొర్రెల కాపరులు ఎంపీడీఓ సావిత్రికి విన్నవించారు. గొర్రెల కాపరులకు టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య అండగా నిలబడ్డారు. వారు మాట్లాడుతూ రాయలచెరువు గ్రామంలో 560ఎకరాల్లో విస్తరించిన చెరువులో చెట్లను నరికి విక్రయించాలని అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. చెట్లను నరకడం వల్ల రాయలచెరువు, కొండుపల్లి, కిష్టిపాడు గ్రామాల్లోని గొర్రెల కాపరులు తమ జీవనాన్ని కోల్పోతారని తెలిపారు. దీనిపై జిల్లాస్థాయిలో స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సమస్యను విన్నవించిన వారిలో మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, తెలుగుయువత నాయకుడు విక్రమ్ ఉన్నారు.

వైభవంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



అలంకరణలో అమ్మవారు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 15: మండలంలోని మార్నేంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో గురువారం గ్రామస్థుల ఆధ్వర్యంలో అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వేకువజామున హోమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు అంకాలమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శ వెంకటశివుడుయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాతిదూలం లాగుడు పోటీలు

కుందుర్పి, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలో లక్ష్మీవెంకటేశ్వరస్వామి రథోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతిగా తోపుదుర్తి చెన్నప్ప ఎద్దులు రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా గంగవరం గురుయాదవ్‌కు చెందిన ఎద్దులు రూ. 20 వేలు సాధించాయి. మూడవ బహుమతి కింద గార్లెదిన్నెకు చెందిన ఎద్దులు రూ.15 వేలు ఏపీ టీచర్స్ ఫెడరేషన్ కుందుర్పి మండల శాఖ ఆధ్వర్యంలో రూ.15 వేలు నగదు అందించారు. సీనియర్ నాయకులు బీసీ తిమ్మప్ప చేతుల మీదుగా విజేతలకు అందించారు. 4వ బహుమతి కింద పరమేష్‌కు చెందిన ఎద్దులు రూ.పది వేలు సాధించాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొమ్మయ్య, ప్రత్యేక ఆహ్వానితులు ఈరప్ప, మండల శాఖ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, రామకృష్ణ, వన్నూరుస్వామి, రవికుమార్, మైలారప్ప పాల్గొన్నారు.